# బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

- 27న స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



బీఆర్ఎస్ చిల్పూరు మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

చిల్పూరు, అక్టోబర్ 17 : స్టేషన్ ఘన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కోరారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని తన నివాసంలో బీఆర్ఎస్ చిల్పూరు మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. అక్టోబర్ 27న సీఎం కేసీఆర్ స్టేషన్ ఘన్‌పూర్ సభకు రానున్నట్లు పేర్కొన్నారు. చిల్పూరు మండలంలోని ప్రజలను సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలించాలని సూచించారు. అలాగే నియోజకవర్గ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. చిల్పూరు మండలంలోని 17 గ్రామాలకు నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసి బూత్ కమిటీలు నియమించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్, పార్టీ అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ బొమ్మిశెట్టి సరితా బాలరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, వైస్ ఎంపీపీ భూక్యా సరితా నర్సింహ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు, గ్రామ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముగ్ధుంతండాలో పీఎస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

జఫర్‌గఢ్, అక్టోబర్ 17 : మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆంజనేయులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పుగల్లు, రఘునాథపల్లి, ముగ్ధుంతండా, షాపల్లి, సూరారం, తీగారం, తిమ్మాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, గదులు, ఇతరత్రా మౌలిక సౌకర్యాలను ఆంజనేయులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాలని ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమాల్లో జేపీఎస్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి

జనగామ రూరల్, అక్టోబర్17: రాజకీయాల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని సీఎం కేసీఆర్‌కు ముదిరాజ్ మహిళా జిల్లా అధ్యక్షురాలు చినబోయిన రేఖ విన్నవించారు. సోమవారం జనగామలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్ సభ అనంతరం బయలుదేరుతున్న సమయంలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారికి అండగా ఉంటానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలి

### వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి విజయానికి కృషి చేయాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పోగుల సారంగపాణి కోరారు. మంగళవారం మండలంలోని తాటికొండ, కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు వారి పరిధిలోని ఓటర్లను ప్రతిరోజు కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలుపొందేలా పని చేయాలని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 27న స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగే కేసీఆర్ బహిరంగ సభకు తమ పరిధిలోని ఓటర్లు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్ ఆనందం, ఎంపీటీసీ వెంకటస్వామి, ఆర్బీఎస్ సభ్యుడు రాపోలు మధుసూదన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పొన్న శ్రీనివాస్, నగరబోయిన యాదగిరి, నగరబోయిన శ్రీరాములు, మండల మాజీ అధ్యక్షుడు అక్కనపల్లి బాలరాజు, ఇనుగాల నర్సింహారెడ్డి, కనకం గణేశ్, కందుల గట్టయ్య, సత్యానారాయణ, యాదగిరి, కడియం యువసేన సోషల్ మీడియా ఇన్‌చార్జి భాస్కుల సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు పొన్న రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి

## కడియం శ్రీహరికే మా మద్దతు

### సంఘీభావం తెలిపిన జఫర్‌గఢ్ వాసులు


జఫర్‌గఢ్, అక్టోబర్ 17 : మండలానికి చెందిన అన్ని వర్గాల నాయకులు స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని మంగళవారం కలిసి తమ మద్దతును ప్రకటించారు. హనుమకొండలోని శ్రీహరి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు అన్ని కుల సంఘాల నాయకులు, బాధ్యులు కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా జఫర్‌గఢ్‌కు చెందిన అన్ని వర్గాల ప్రజల మద్దతు కడియం శ్రీహరికే అని నినదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కడియం శ్రీహరిని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరిని లక్ష మెజార్టీతో గెలిపించుకుని సీఎం కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు మోహన్‌రావు, మొగిలి, యాకయ్య, సోమశేఖర్, స్వామి, రాజు, ఏఎంసీ డైరెక్టర్ తాటికాయల వరుణ్ కుమార్, శంకర్, నాగరాజు, ఆయా కుల సంఘాల బాధ్యులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుంబాల భాస్కర్‌రెడ్డి

## బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీలో గెలిపించాలి

లింగాలఘనపురం, అక్టోబర్ 17 : స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు దుంబాల భాస్కర్‌రెడ్డి కోరారు. నాగారంలో మంగళవారం బీఆర్ఎస్ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నియోజకవర్గంలో కడియం శ్రీహరి గెలుపు ఖాయమయ్యిందన్నారు. అంతా కలిసికట్టుగా శ్రమించి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించి రాష్ట్రంలోనే రికార్డు సాధించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గవ్వల మల్లేశం, విండో చైర్మన్ మల్గ శ్రీశైలం నాయకులు మార్పు శ్రీనివాస్‌రెడ్డి, కారంపురి చంద్రయ్య, కాటం కుమారస్వామి, గొరిగె అనిల్, మేకల మురళి, గొరిగె మదార్, చౌదరపెల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

## వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

జఫర్‌గఢ్, అక్టోబర్ 17 : మండలంలోని తమ్మడపల్లి(జి) దుర్గామాత ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు మూడోరోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు చేసినట్లు ఆలయ అర్చకుడు యెల్లంభట్ల శశిధర్‌శర్మ తెలిపారు. కార్యక్రమం లో ఉత్సవాల నిర్వాహకులు ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

జనగామ రూరల్, అక్టోబర్ 17: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా సరిహద్దు గ్రామం పెంబర్తి వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. పెంబర్తి చెక్‌పోస్ట్ వద్ద డీసీపీ సీతారాం, ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ దారిలో వెళ్తున్న ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్‌రావ్ ఠాక్రే వాహనాలనూ తనిఖీ చేసి పంపించారు.

# కడియం శ్రీహరికి చిల్పూరు మండల దళితుల మద్దతు

- అన్ని వర్గాల కోసం బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు సుదర్శన్

చిల్పూరు, అక్టోబర్ 17 : మండలంలోని 17 గ్రామాల దళితుల మద్దతు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ఉందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు ఇల్లందుల సుదర్శన్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో మంగళవారం సుదర్శన్ మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన దళిత సంఘాల నాయకులు మంగళవారం సమావేశమై శ్రీహరికి మద్దతు తెలిపారన్నారు. మండల కేంద్రంలో దళిత మద్దతు సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎత్తులను చిత్తు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా మ్యానిఫెస్టోను విడుదల చేశారన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం కడియంకే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి కడియం శ్రీహరిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కలకోల పోచయ్య, గంగారపు రాజు, ఇల్లందుల హరిబాబు, నీలమెల కుమారస్వామి, ఇల్లందుల విజయ్, కనకం లక్ష్మీనారాయణ, ఎడ్ల మల్లయ్య, అరూరి స్వామి, అరూరి దాసు, పాశం యాదగిరి, ఇల్లందుల మహేశ్, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపెండ్యాలలో మాట్లాడుతున్న ఇల్లందుల సుదర్శన్